విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365

TGTEL/26/A6221

తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

యాదాద్రి భువనగిరి	సంపుటి: 01	సంచిక : 92	శుక్రవారం	30-10-2026	ఎడిటర్: యంజాల ప్రవీణ్	పేజీలు: 08	వెల: రూ.2/-
Yadadri Bhuvanagiri	Volume:01	Issue:92	Friday	30-10-2026	Editor:Yamjala praveen	Pages:08	Cost:2/-

యూపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలానికి షాక్

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సుమారు ఐదు నెలల ముందు జరిగిన శాసనమండలి ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు చెందిన 11 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో అధికార బీజేపీ ఆరు స్థానాలను కైవసం చేసుకోగా, ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఐదు స్థానాల్లో గెలిచి అనూహ్యమైన పురోగతి కనబరిచింది. అక్టోబర్ 23న బ్యాలెట్ పత్రాల ద్వారా ఈ ఎన్నికల పోలింగ్ జరగ్గా, అక్టోబర్ 27న ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ దాదాపు ఒక రోజుకు పైగా కొనసాగింది.

'దిమాగీ నక్సల్' వ్యాఖ్యలపై దుమారం..

- నసీరుద్దీన్ షాపై ఎన్డీఏ నేతల ఫైర్
- నేను గర్వపడే 'దిమాగీ నక్సల్' అంటూ వీడియో విడుదల చేసిన నసీరుద్దీన్ షా
- నటుడి వ్యాఖ్యలపై ఎన్డీఏ నేతల తీవ్రస్థాయిలో విమర్శలు
- షా అరాచకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారని బీజేపీ నేతల ఆరోపణ
- విమర్శించే వారందరికీ బీజేపీ ముద్రలు వేస్తుందన్న ప్రతిపక్షాలు

2

ఉక్రెయిన్ రైల్వే స్టేషన్‌పై రష్యా డ్రోన్ దాడి 14 మంది మృతి

- నిప్రో రైల్వే స్టేషన్‌పై రష్యా జెట్-పవర్డ్ డ్రోన్‌తో దాడి
- 14 మంది మృతి, మరో 14 మందికి తీవ్ర గాయాలు
- ఉక్రెయిన్ వ్యాప్తంగా దాడుల్లో 20కి పైగా పౌరుల మృతి
- పౌరులనే లక్ష్యంగా చేసుకున్నారంటూ జెలెన్‌స్కీ ఆవేదన
- రష్యాపై కఠిన ఆంక్షలు విధించాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపు

2

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం

ఫార్మా, ఏరోస్పేస్, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో అపార అవకాశాలు

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

2

'అర్నాబ్' తుఫాన్ నష్టం రూ.4,563 కోట్లు..

- తుఫాన్‌తో ఏపీకి రూ.4,563 కోట్ల ప్రాథమిక నష్టం
- రైతుల ఖాతాల్లోకి రూ.6 వేలు.. రూ.3,120 కోట్ల విడుదల
- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటన
- ప్రాణ నష్టాన్ని సున్నాకు తగ్గించడమే లక్ష్యమన్న సీఎం

అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ భేటీలో 'అర్నాబ్' తీవ్ర తుఫాన్ వల్ల రాష్ట్రంలో సంభవించిన తీవ్ర నష్టంతో పాటు సహాయక చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్నాబ్ తుఫాన్ కారణంగా ప్రాథమికంగా రూ.4,563 కోట్ల మేర ఆస్తి, పంట నష్టం వాటిల్లిందని సీఎం కేబినెట్‌కు వివరించారు. నష్ట తీవ్రతను స్వయంగా అంచనా వేసేందుకు రేపు కేంద్ర బృందం రాష్ట్రానికి రానున్నట్లు వెల్లడించారు.

- మిగతా 2వ పేజీలో

పోలీసులకు, లాఠీలకు బెదరొద్దు

- నవంబర్ 1న 'చలో ఢిల్లీ'లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలి
- ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం
- ప్రజలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు
- ఇది భారతదేశ ఆత్మను కాపాడే ఉద్యమమని స్పష్టీకరణ

2

పెట్టుబడులు రెట్టింపు చేయండి..

- డిసెంబర్‌లో హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- ప్రపంచ నగరాలతో పోటీపడేలా హైదరాబాద్ అభివృద్ధి
- సీఎం చంద్రబాబు విజ్ఞప్తికి రేవంత్ సర్కార్ సానుకూల స్పందన
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు 500 మంది సిబ్బంది తరలింపు
- తుపాను కారణంగా 16 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు ధ్వంసం
- విపత్కర సమయంలో తెలుగు రాష్ట్రాల మధ్య అరుదైన స్నేహబంధం

ఢిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని 'భారత్ ఫ్యూ సిటీ'లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు పెట్టుబడిదారులందరినీ ఆహ్వానించారు. సుమారు 400 ఏళ్ల క్రితమే హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా వెలిగిందని, విదేశీ వ్యాపారులు చార్మినార్ వద్దకు వచ్చి ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు కొనుగోలు చేసేవారని గుర్తుచేశారు. నిజాం రాజుల అద్భుత కట్టడాలు, మ్యూజియం, విమానాశ్రయం, రైల్వేలతో పాటు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్

- మిగతా 2వ పేజీలో

గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్స్ సమ్మిట్

- మూసీ సుందరీకరణ ముసుగులో రూ.లక్షన్నర కోట్ల లూటీకి కుట్ర: కేటీఆర్
- సాగు, తాగునీటికి దిక్కులేదు.. మూసీకి 10 టీఎంసీలు తెస్తారా?
- డీపీఆర్ లేని సుందరీకరణ ప్రాజెక్టుపై న్యాయ పోరాటం చేస్తాం

హైదరాబాద్: రాష్ట్రంలో కరువు లేదంటూనే మూసీ సుందరీకరణ పేరిట రేవంత్ ప్రభుత్వం వేలాది ఎకరాల భూమిని లూటీ చేసేందుకు ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రజల గొంతు నొక్కుతూ సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) లేకుండా 'పబ్లిక్ హియ రింగ్' తంతును ముగించే ప్రయత్నాలు

2

ఆర్మేనియా పార్లమెంట్‌లో ఎంపీల ముష్టియుద్ధం.

- ఆర్మేనియా పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య తీవ్ర ఘర్షణ
- ప్రత్యక్ష ప్రసారంలోనే పిడిగుద్దులు, తన్నులు, కుర్చీలతో దాడులు
- అవినీతి ఆరోపణలతో మొదలైన వాగ్వాదం హింసకు దారితీసిన వైనం
- ఎంపీల ప్రవర్తనను ప్రజలు చూడాలనే ప్రత్యక్ష ప్రసారం ఆపని స్పీకర్
- తమ పార్టీ ఎంపీల చర్యలను సమర్థించిన ఆర్మేనియా ప్రధాని

2

ఆర్మేనియా పార్లమెంటులో అసాధారణ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యుల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరి తీవ్ర ఘర్షణకు దారితీసింది. ప్రత్యక్ష ప్రసారం జరుగుతుండగానే ఎంపీలు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు, తన్నుకున్నారు. ఈ గొడవలో ఒక ఎంపీ కుర్చీ విసిరి దాడి చేయగా, మరొకరు నీళ్లు చల్లుకుని సభలో గందరగోళం సృష్టించారు. గురువారం ఆర్మేనియా నేషనల్ అసెంబ్లీలో ఆడిట్ ఛాంబర్ సభ్యుడి ఎన్నికపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

అర్నబ్ తుపాను అనంతర చర్యలు.

- అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల వేగవంతం
- అంటువ్యాధుల నివారణకు పవన్ కల్యాణ్ ఆదేశాలు
- 9 జిల్లాల నుంచి 475 మంది సిబ్బందితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు

అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని, ప్రజారోగ్యం విషయంలో ఎలాంటి ఆపద తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు త్వరగా నెలకొనేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలను వేగంగా

- మిగతా 2వ పేజీలో

ఉక్రెయిన్ రైల్వే స్టేషన్‌పై రష్యా డ్రోన్ దాడి 14 మంది మృతి

ఖెర్సన్: ఉక్రెయిన్‌లోని నీప్రో రైల్వే స్టేషన్‌పై గురువారం ఉదయం రష్యా జరిపిన డ్రోన్ దాడిలో కనీసం 14 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. 11 ఏళ్ల బాలుడు సహా మరో 14 మంది గాయపడ్డారని నీప్రోపెట్రోవిస్క్ ప్రాంత చీఫ్ ఒలెగ్జాండర్ హంజా చెప్పారు. క్షతగాత్రుల్లో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. జపోరిజియా వైపు వెళ్లే ఈ రైలు నీప్రో రైల్వే స్టేషన్‌లోని ఓ ప్లాట్‌ఫాం వద్ద నిలిచి ఉండగా జెట్ పవర్డ్ డ్రోన్ దాడి జరిగిందన్నారు. రష్యా దాడులకు పాల్పడే ప్రమాదముందంటూ ముందుగా హెచ్చరికలు చేసినప్పటికీ, ఘటన సమయంలో ప్లాట్‌ఫాంపై పెద్ద సంఖ్యలో ప్రయాణికులు నిలిచి ఉండటంతో ప్రమాద తీవ్రత పెరిగిందని వివరించారు. డ్రోన్ దాడి తీవ్రతకు రైలు బోగీ అద్దాలు పగిలిపోగా, భారీ గుంత ఏర్పడి, ప్లాట్‌ఫాం ధ్వంసమైంది. ప్రయాణికుల మృతదేహాలు ఛిద్రమై చెల్లా చెదురుగా పడి ఉన్న దృశ్యాలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. క్షతగాత్రుల్లో చాలా మందికి బాంబు శకలాలు తగలి గాయాలయ్యాయని, నలుగురికి అత్యవసర శస్త్రచికిత్స చేస్తున్నామని స్థానిక ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. రష్యా డ్రోన్ దాడి సమయంలో ఆ స్టేషన్‌లో రెండు ప్రయాణికుల రైళ్లు నిలిచి ఉండగా, సామాన్య ప్రయాణికులు ప్లాట్‌ఫాంలపై నిల్చుని ఉన్నారన్నారు. సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఉగ్ర దాడులకు తెగబడుతున్న రష్యాపై మరిన్ని ఆంక్షలను విధించాలని జీ7 దేశాలను జెలెన్స్కీ కోరారు. కాగా, తాము ఉక్రెయిన్ సైనికులు, మిలటరీ సామగ్రి రవాణా వనరులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులు జరుపుతున్నామని రష్యా రక్షణ శాఖ పేర్కొంది. ఇలా ఉండగా, ఉక్రెయిన్‌లోని చెర్?నహివ్ ప్రాంతంపై రష్యా జరిపిన క్షిపణి దాడిలో ఇద్దరు 15 ఏళ్ల బాలికలు చనిపోగా, పలువురు చిన్నారులు సహా 19 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

రైళ్లపై భారీగా పెరిగిన రష్యా దాడులు

రష్యా వరుస దాడులతో ఉక్రెయిన్‌లో రైలు ప్రయాణం ప్రమాదకరంగా మారిందని, ప్రయాణికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని దేశ రైల్వే శాఖ ఉక్ర్‌జలిజ్‌నిట్సియా ఆందోళన వ్యక్తం చేసింది. ఉక్రెయిన్‌పై దురాక్రమణ మొదలయ్యాక రష్యా ఇప్పటి దాకా 521 రైళ్లపై దాడులు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో కనీసం 60 శాతం వరకు ఈ ఏడాదిలో జరిగినవే కావడం గమనార్హం.

ఆర్మేనియా పార్లమెంట్‌లో ఎంపీల ముష్టియుద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని నికోల్ పషిన్యాన్ నేతృత్వంలోని అధికార సివిల్ కాంట్రాక్ట్ పార్టీ ఎంపీ టరాన్ చఖోయాన్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష స్ట్రాంగ్ ఆర్మేనియా పార్టీపై అవినీతి ఆరోపణలు చేశారు. ఆ పార్టీ నేత నరేక్ కారపెత్యాన్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ, ఆయన బంధువు చేసిన పాత వ్యాఖ్యలను గుర్తుచేశారు. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలోనే నరేక్ కారపెత్యాన్ పోడియం వద్దకు దూసుకురావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రతిపక్ష ఎంపీ గార్నిక్ దావ్త్యాన్ తొలి పిడిగుద్దు విసిరారని స్పీకర్ తెలిపారు. అనంతరం సభ మొత్తం రణరంగంగా మారింది. డిప్యూటీ స్పీకర్ వాహగ్న్ అలెక్సాన్యన్ ఏకంగా ప్రతిపక్ష సభ్యులపైకి కుర్చీ విసిరారు. ఈ ఘర్షణలో ప్రతిపక్ష ఎంపీ ఆండ్రానిక్ గెవోర్గ్యాన్ ముక్కు పగిలి రక్తం కారగా, మరో ఎంపీ రూబెన్ ఖితార్యాన్ దుస్తులు చిరిగాయి. దీంతో పార్లమెంటు భవనం వద్దకు అంబులెన్స్‌ను పిలిపించారు. కొద్దిసేపు ఘర్షణను చూస్తూ ఉండిపోయిన స్పీకర్ రూబెన్ రూబిన్యాన్, ఎంపీల ప్రవర్తనను ప్రజలు చూడాలనే ఉద్దేశంతోనే తాను ప్రత్యక్ష ప్రసారాన్ని కొనసాగించానని స్పష్టం చేశారు. అనంతరం సభను వాయిదా వేశారు. ఈ ఘటనపై స్పందించిన ప్రధాని నికోల్ పషిన్యాన్, హింసకు పూర్తి బాధ్యత ప్రతిపక్షాలదేనని ఆరోపించారు. తమ పార్టీ ఎంపీల చర్యలను సమర్థిస్తూ, కుర్చీ విసరడం "సరైన ప్రతిచర్య" అని వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రతిపక్షాలు తమ స్థానం తెలుసుకోవాలని, లేదంటే ఇలాంటి పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు అంతర్జాతీయంగా వైరల్ అయ్యాయి.

పోలీసులకు, లాఠీలకు బెదరొద్దు

న్యూఢిల్లీ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకు, ఓట్ల చోరీని అడ్డుకొనేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించే 'చలో ఢిల్లీ'ర్యాలీలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. రాజకీయాలతో సంబంధం లేకుండా విద్యార్థి సంఘాలు సైతం ఈ నిరసన ర్యాలీలో చేరాలని కోరారు. పోలీసులకు, వారి లాఠీలకు ఎవరూ బెదరొద్దని స్పష్టంచేశారు. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన ర్యాలీ కాదని, భారతదేశ ఆత్మను కాపాడే ఉద్యమమని తేల్చిచెప్పారు. ఈ మేరకు రాహుల్ గాంధీ గురువారం 'ఎక్స్'లో ఒక వీడియోను పోస్టుచేశారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోవడానికి మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగుదామని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యవహార శైలితో ప్రజలు పూర్తిగా విసుగెత్తిపోయారని తెలిపారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం

న్యూఢిల్లీ: తెలంగాణ నిర్దేశించుకున్న 'తెలంగాణ రైజింగ్--2047' లక్ష్యం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. సమష్టి కృషితో దానిని సాధించవచ్చునికేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందన్నారు. నిన్న (గురువారం) తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026 కర్టెన్ రైజర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఫార్మా, అంతరిక్షం, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, ఆహార శుద్ధి, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. పెట్టుబడులు పెట్టే ముందు పారిశ్రామికవేత్తలు ప్రధానంగా ఆశించేది విధానాల్లో స్థిరత్వం, నిబంధనల్లో స్పష్టత, వ్యాపార నిర్వహణలో పారదర్శకతేనని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

'అర్నాబ్' తుఫాన్ నష్టం రూ.4,563 కోట్లు..

(మొదటి పేజీ తరువాయి)

ఇదే సమయంలో తుఫాన్ ధాటికి ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు కేబినెట్ సమావేశం సంతాపం ప్రకటించింది.

రైతుల ఖాతాల్లోకి రూ.6 వేల సాయం..

తుఫాన్ కష్టాల్లో ఉన్న అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేపు పిఎం కిసాన్ పథకం కింద కేంద్రం ఇచ్చే రూ.2,000తో పాటు, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.4,000 కలిపి మొత్తం రూ.6,000ల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఇందుకోసం ప్రభుత్వం నుంచి రూ.3,120 కోట్ల నిధులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ధైర్యం చెప్పేందుకు స్వయంగా పర్యటించనున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ రోజు, రేపు ఉభయ గోదావరితో పాటు ఇతర జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం తెలపగా.. రేపు తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించి అక్కడి పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం సమీక్షిస్తూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం వల్లే అధికారులు కూడా క్షేత్రస్థాయిలో తీవ్రంగా శ్రమించారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. సీఎం చూపిన చొరవ, ముందస్తు జాగ్రత్తల వల్లే రాష్ట్రంలో ప్రాణ, ఆస్తి నష్టం చాలా వరకు తగ్గిందని, సంక్షోభ సమయంలో ఆయన స్పందించిన తీరు ప్రశంసనీయమని పవన్ కొనియాడారు.

తుఫాన్లు, ఫ్యాక్షన్‌లపై సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

గతంలో దివిసీమ ఉప్పెన వచ్చినప్పుడు వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని, కానీ సాంకేతికత, అప్రమత్తతతో ఇప్పుడు ప్రజల ప్రాణాలను కాపాడుకునే స్థాయికి చేరుకున్నామని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వారసత్వంగా రాయలసీమలో ఫ్యాక్షనిజం, కోస్తాలో తుఫాన్లు అనే రెండు ప్రధాన సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. రాయలసీమలో ఫ్యాక్షన్‌ను పూర్తిగా నిర్మూలించి అక్కడ ఉద్యాన పంటలు పండించేలా చేశామని, అలాగే కోస్తాలో తరచూ తుఫాన్లు వస్తున్నప్పటికీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని కనిష్ట స్థాయికి తగ్గించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. భావి రోజుల్లో ప్రాణ నష్టాన్ని సున్నాకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఇదే సమయంలో తుఫాన్ తాకిడికి మత్స్యకారుల పడవలు పూర్తిగా ధ్వంసమయ్యాయని మంత్రి అచ్చెన్నాయుడు కేబినెట్ దృష్టికి తీసుకురాగా.. దెబ్బతిన్న పడవల పరిహారం కోసం కేంద్ర సాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి కూడా తగిన ఆర్థిక సాయం అందిద్దామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

'దిమాగీ నక్సల్' వ్యాఖ్యలపై దుమారం..

ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షా చేసిన 'దిమాగీ నక్సల్' వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ఆయన అరాచకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారంటూ ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలు గురువారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన 'దిమాగీ నక్సల్' అనే పదాన్ని ఉటంకిస్తూ నసీరుద్దీన్ షా ఒక వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో 'దిమాగీ నక్సల్' బ్యాడ్జిని ధరించిన ఆయన, తాను ఒక 'గర్వించదగ్గ దిమాగీ నక్సల్' అని ప్రకటించుకున్నారు. తద్వారా ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడంతో ఈ వివాదం ముదిరింది. షా వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. నసీరుద్దీన్ షా భాష, గతంలో ఆయన పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడిన తీరు దేశంలో అరాచకాన్ని ప్రేరేపించేలా ఉన్నాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యే రామ్ కదమ్ మరింత ఘాటుగా స్పందిస్తూ.. షాను 'దిమాగీ నక్సల్' కంటే 'దిమాగీ పాకిస్థానీ' అని పిలవడం సబబని, గతంలో ఆయన మొఘల్ పాలకులను కీర్తించారని విమర్శించారు. కేంద్ర మంత్రులు రామ్‌దాస్ అథవాలే, కిరణ్ రిజిజు సైతం షా వ్యాఖ్యలను తప్పుబట్టారు. నసీరుద్దీన్ షా గొప్ప నటుడే కావొచ్చు కానీ, ఆయనకు నక్సలైట్ మనస్తత్వం ఉండకూడదని అథవాలే హితవు పలికారు. షా ధోరణి భారత ప్రజాస్వామ్యానికి అత్యంత హానికరమని రిజిజు అభివర్ణించారు. మరోవైపు, ప్రతిపక్ష పార్టీలు నసీరుద్దీన్ షాకు బాసటగా నిలిచాయి. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే లేదా విమర్శించే వారందరిపై బీజేపీ 'తుక్డే–తుక్డే గ్యాంగ్' లేదా 'అర్బన్ నక్సల్' వంటి ముద్రలు వేస్తోందని కాంగ్రెస్ ఎంపీ జేబీ మాథర్ ధ్వజమెత్తారు. షా కేవలం తన వ్యక్తిగత అభిప్రాయాన్ని మాత్రమే వ్యక్తం చేశారని, అది నచ్చకనే బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్ పేర్కొన్నారు.

అర్నబ్ తుపాను అనంతర చర్యలు..

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 9 జిల్లాల నుంచి మొత్తం 475 మంది సిబ్బందితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పర్యావరణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటాయి. అదేవిధంగా, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక వాటర్ టెస్టింగ్ బృందాలను కూడా రంగంలోకి దించారు. నీటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా నివారించడం, పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడంపై ఈ బృందాలు దృష్టి సారిస్తాయి.

గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్స్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

జరుగు తున్నాయని మండిపడ్డారు. ఓ వైపు కరువుతో అల్లాడుతుంటే రూ.లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు టెండర్లు పిలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఓ వైపు పశుగ్రా సానికి కూడా కొరత ఉంటే మరోవైపు మల్లన్న సాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని తెచ్చి మూసీలో పోసి రేవంత్ సుంద రీకరణ పేరిట హడావుడి చేస్తున్నాడని మండిపడ్డారు. క్రాప్ హాలిడే ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు హాలిడే ఇవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో కేటీ ఆర్ మాట్లాడారు. 'కృష్ణా గోదావరి నదుల్లో వేయి టీఎంసీలను నిర్లక్ష్యంతో దిగువకు వదిలేసిన రేవంత్ ప్రభుత్వం 365 కరువు మండలాలను ప్రకటించింది. పొరుగున ఉన్న తమిళనాడులో 35 శాతం, కర్ణాటకలో 30 శాతం లోటు వర్షపాతం నమోదైనా కరువు లేదు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పిస్తామంటూ రేవంత్ ప్రభుత్వం రైతులను కూలీలుగా మారుస్తోంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు తెర మీదకు వచ్చింది మొదలు కుని బాధితుల పక్షాన బీఆర్ఎస్ గళమెత్తుతూ వస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబిత, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, పార్టీ నేతలు కార్తీక్‌రెడ్డిని పబ్లిక్ హియరింగ్‌కు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గం.రాష్ట్రంలో ఏం జరుగుతుందో రాహుల్‌గాంధీ తెలుసు కోవాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

దోపిడీని అడ్డుకోవడంలో తగ్గేది లేదు

'రేవంత్ అహంకారపూరిత మనస్తత్వం వల్లే రాష్ట్రంలో నీటి ఎద్దడి ఏర్పడింది. కాంగ్రెస్ పాలనలో కరెంటు ఉండదని తేలి పోయింది. సాయంత్రం 6 గంటల తర్వాత విద్యుత్ ఇవ్వలే మంటూ ఐటీ కంపెనీలకు ఫోన్లు చేస్తున్నారు. ఎన్ని కలకు ముందు డిక్లరేషన్లు ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు పంటలు వేయొద్దని రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకుంటోంది. తాగునీరు లేక హైదరాబాద్ నుంచి వలసలు వెళ్లే పరిస్థితులు ఉన్నాయి. అధికారం చేపట్టి మూడేళ్లుగా కాంగ్రెస్ చేస్తున్న దోపిడీని అడ్డుకోవడంలో వెనక్కి తగ్గేది లేదు' అని కేటీఆర్ చెప్పారు. 'ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ పేరిట హడావుడి చేస్తోంది. అది గోబెల్స్ సమ్మిట్. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడులు, ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి' అని కేటీఆర్ అన్నారు. 'నిజం నిలకడ మీద తెలు స్తుంది. నా మీద తప్పుడు వార్త ప్రచురించిన ఈనాడు క్షమాపణ చెప్పింది. మొన్న ఒక పత్రిక క్షమాపణ చెప్పింది.

పెట్టుబడులు రెట్టింపు చేయండి..

(మొదటి పేజీ తరువాయి)

కంప్యూటర్, టెలికాం విప్లవానికి నాంది పలికిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హైదరాబాద్‌లోనే పైలట్‌గా శిక్షణ పొందారని, అందుకే అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టుకున్నామని సీఎం తెలిపారు. అలాగే 1991లో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాన్ని ఎల్‌పీజీ (ఎ్రా+) సంస్కరణలతో గట్టెక్కించిన తెలంగాణ ముద్దుబిడ్డ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవలను స్మరించుకున్నారు. 1991 నుంచి ఇప్పటివరకు ఏ పార్టీ అధికారంలో ఉన్నా హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అందరూ మద్దతుగా నిలిచారన్నారు. "తెలంగాణలో మీరు పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడికి భద్రత కల్పించడం, అది వృద్ధి చెందేలా చూడడం నా వ్యక్తిగత బాధ్యత. మీ ఇన్వెస్ట్‌మెంట్‌కు నేను సంరక్షకుడిగా ఉంటా. మీరు అనుకున్న పెట్టుబడి, లాభాల అంచనాలను రెట్టింపు చేయండి.. మీకు కావాల్సిన విధానపరమైన మద్దతు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం అభయమిచ్చారు. 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళిక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా ఉందన్నారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే, అందులో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలని ఆకాంక్షించారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కేంద్రం–రాష్ట్రాల మధ్య సంబంధాలపై పెట్టుబడిదారులకు ఎలాంటి సందేహాలు అవసరం లేదని, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చెప్పినట్లు అభివృద్ధి విషయంలో ఇరు ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలో కేంద్రం ప్రతిపాదించిన 7 హైస్పీడ్ రైలు కారిడార్లలో 3 కారిడార్లు (హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–పుణె) మన నగరానికే రానున్నాయని సీఎం వెల్లడించారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, రీజినల్ రింగ్ రోడ్డు (===), మెట్రో విస్తరణ వంటి పనుల్లో కేంద్ర సహకారం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇప్పుడు ఢిల్లీ, ముంబై, బెంగళూరులతో కాకుండా న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడాలని సీఎం పిలుపునిచ్చారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక
TOLE VELUGGU JATIYAPATRIKA
యాదాద్రి భువనగిరి శుక్రవారం 30 అక్టోబర్ 2026

చిన్నగూడూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

○ రైతుల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి

○ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన సర్పంచి బి. రమేష్

తొలివెలుగు, చిన్నగూడూరు : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో చిన్నగూడూరు మండలానికి చోటు కల్పించకపోవడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పందించారు. మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చిన్నగూడూరును కూడా కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ గ్రామ సర్పంచి బి. రమేష్ ఆధ్వర్యంలో గురువారం మండల రెవెన్యూ అధికారి లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి బి. రమేష్ మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కరువు ప్రభావం ఉన్నప్పటికీ మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడంపై ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యవసాయ పరిస్థితులను పరిశీలించాలని, వాస్తవ పరిస్థితుల ఆధారంగా చిన్నగూడూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ప్రభుత్వపరంగా తగిన సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సుధాగాని నాగేష్, ఉప సర్పంచి గాడిపల్లి జీవన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొత్త శేఖర్, వార్డు సభ్యుడు జనక శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాడిపల్లి అనిల్, జి. శ్రీనివాస్, షేక్ బషీద్, గాడిపల్లి రవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతుల రాంరెడ్డి కన్వెన్షన్ హాల్ ప్రారంభం

○ హాజరైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, అనంతుల రాజారెడ్డి, పోచంపల్లి రాజేందర్‌రెడ్డి

○ నాగోల్ పరిసర ప్రాంత ప్రజలకు సౌకర్యవంతమైన వేదిక

తొలివెలుగు, ఎల్బీనగర్: హైదరాబాద్‌లోని నాగోల్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన అనంతుల రాంరెడ్డి కన్వెన్షన్ హాల్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, అనంతుల రాజారెడ్డి, పోచంపల్లి రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగోల్ పరిసర ప్రాంతాల ప్రజల అవసరాలకు అనుగుణంగా కన్వెన్షన్ హాల్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. వివాహాలు, ఇతర శుభకార్యాలు, సామాజిక సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ వేదిక ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన వేదికగా కన్వెన్షన్ హాల్ అందుబాటులో ఉండటం వల్ల సమీప ప్రాంతాల వారికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు, నాగోల్ పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

○ పత్యామ్నాయం చూపిన తర్వాతే చర్యలు చేపట్టాలి

○ అధికారులకు స్పష్టం చేసిన ఎల్బీనగర్ శాసనసభ్యుడు

తొలివెలుగు, ఎల్బీనగర్ : అభివృద్ధి పనుల పేరుతో పేద చిరు వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని టీకేఆర్ ఆర్చ్ నుంచి టీకేఆర్ కళాశాల వరకు 100 అడుగుల రహదారి నిర్మాణంలో భాగంగా రహదారి పక్కన ఉన్న డబ్బాలను అధికారులు ఇటీవల తొలగించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గురువారం ఉదయం 6 గంటలకే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. రహదారి విస్తరణ పేరుతో పెద్ద నిర్మాణాలను వదిలేసి, చిన్న వ్యాపారుల డబ్బాలను తొలగించడంపై వ్యాపారులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో ఫోన్‌లో మాట్లాడారు. వ్యాపారుల ఉపాధిని దృష్టిలో ఉంచుకుని తొలగింపు చర్యలను కొద్దిరోజులు నిలిపివేయాలని, ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్యంచారి, మహిళా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, నాయకులు శ్రీనివాస్ నాయక్, కాప్రా నాయక్, గోపి మధు, నాగిరెడ్డి, బిక్షపతి, సాయి యాదవ్, మహేందర్, కృష్ణ, నరేష్, రెడ్డిమాల కృష్ణ, విష్ణు గౌడ్, అనిత, కింగ్ మధు తదితరులు పాల్గొన్నారు.

14 ఏళ్లయినా వీడని వంతెన గ్రహణం!

○ జూలూరు-రుద్రవెల్లి మూసీ వంతెన నిర్మాణం పూర్తి చేయాలని బీజేపీ మహాధర్నా

○ ప్రభుత్వాల మార్పుతోనే సరిపోతుందా.. ప్రజల కష్టాలు పట్టవా?

○ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్ ధ్వజం

తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి: ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా జూలూరు-రుద్రవెల్లి మూసీ వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీబీనగర్, భూదాన్ పోచంపల్లి మండలాల ప్రజలు ఏళ్ళుగా ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వంతెన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జూలూరు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు.

14 ఏళ్లుగా హామీలకే పరిమితం:

ధర్నాలో అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా వంతెన నిర్మాణం హామీలకే పరిమితమైందని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షం కురిసినా రాకపోకలు నిలిచిపోతున్నాయని, దీంతో రెండు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడంతో సమయం వృథా కావడమే కాకుండా ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అత్యవసర సమయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి:

ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి, పనులను వేగవంతం చేయాలని కోరారు. కేవలం హామీలతో కాలయాపన చేయకుండా నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో బీజేపీ నాయకులు పాశం భాస్కర్‌గౌడ్, ఏల చంద్రశేఖర్, గూడూరు నరోత్తంరెడ్డి, మాయ దశరథ, మేకల చొక్కారెడ్డి, చేరుకు వెంకటేశం, మేకల రవీందర్‌రెడ్డి, డబ్బికార్ సాహెష్, పల్లెకాడి బసవయ్య, చిక్క కృష్ణ, బసవలింగం, ముద్దం హరీష్, ఉప్పునూతల నరసింహ, ఏల శ్రీనివాస్, యాదిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

○ జయ్యారంలో పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశం

○ పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ దిశానిర్దేశం

తొలివెలుగు, చిన్నగూడూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా బీఆర్ఎస్ శ్రేణులు చొరవ చూపాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్. రెడ్యానాయక్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) పూర్తి చేసిన విద్యార్థులు, అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు హక్కు పొందేలా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వామ్యులు కావాలని దిశానిర్దేశం చేశారు. గ్రామాల వారీగా ఓటరు నమోదు పురోగతిని పర్యవేక్షించాలని కోరారు. ఈ సమావేశంలో చిన్నగూడూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు డి.ఎస్. రామ్‌సింగ్, మండల మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మంగపతి రావు, కేసముద్రం మాజీ డైరెక్టర్ బంటు ఉపేందర్, మండల ప్రధాన కార్యదర్శి కరే ధారాసింగ్, మండల యువజన నాయకుడు వల్లూరి చెన్నారెడ్డి, ఉగ్గంపల్లి సర్పంచ్ ఎం.డి. అయూబ్ పాషా, నాయకులు అమృతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చెవుల ముత్తయ్య, ఈ యాకి, హుస్సేన్, చెక్కల శీను, ఫోటో శ్రీనివాస్, గాడిపెల్లి శ్రీను, గంధసిరి వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు, మండల యువజన అధ్యక్షుడు దుండి మురళి, తుడుం ప్రభాకర్, మేఘ్య తండా గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్య చిరంజీవి, మండల సామాజిక మాధ్యమాల అధ్యక్షుడు బాదావత్ సురేష్‌తోపాటు వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు భరోసా.. పరీక్ష ఫీజు చెల్లించిన ఉద్యమకారుడు

○ చిట్యాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సాయం

○ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: కునూరు సంజీవదాస్‌గౌడ్

తొలివెలుగు, చిట్యాల: చిట్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి అభ్యసిస్తున్న 38 మంది విద్యార్థులకు వార్షిక పరీక్ష ఫీజును తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కునూరు సంజీవదాస్‌గౌడ్ గురువారం ఆర్థిక సాయంగ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని రాబోయే పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని, మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ సుశీల, నేస్తం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు టీజీ లింగం, తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు లింగస్వామి, బత్తుల నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరేగూడెం కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొలను సత్తిరెడ్డి

○ నూతన కమిటీ సభ్యులను సత్కరించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

○ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు

తొలివెలుగు, చిట్యాల : చిట్యాల మండలంలోని ఆరేగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడిగా కొలను సత్తిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దొడ్డి సతీష్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా అగ్రూరి నర్సింహ, కొలను రవీందర్‌రెడ్డి, కోరబోయిన రఘు, ప్రధాన కార్యదర్శిగా రాచమల్ల తిరుమలయ్య, కార్యదర్శులుగా నాగులగాని శ్యాముందర్, అగ్రూరి నర్సింహ, వల్లందాసు కృష్ణయ్య, కోశాధికారిగా అగ్రూరి తిరుమలయ్య తదితరులు ఎంపికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను నకిరేకల్‌లో రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శాలువాలతో సత్కరించి అభినందించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, నాయకులు పిశాటి మాధవరెడ్డి, రాచమల్ల జానయ్య, అగ్రూరి నర్సింహ, దొడ్డి నర్సింహ, ఇరుపాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు

○ 'ప్రజా కేర్' ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

○ ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు

తొలివెలుగు, హయత్‌నగర్ : హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ప్రజా కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి'ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరై, ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారా కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. స్థానికంగానే మల్టీ స్పెషాలిటీ సేవలు లభించడం వల్ల ప్రజలకు సమయం కలిసిరావడంతో పాటు అత్యవసర వేళల్లో సత్వర వైద్యం అందుతుందన్నారు. ఆసుపత్రి యాజమాన్యం ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాండల శ్రీధర్, బద్దం రవీందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు జంజ్య నాయక్, బాలు నాయక్, కాలనీవాసులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తత, క్రమశిక్షణ అవసరం

ం పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఐజీ జోయల్ డేవిస్

ం కేసుల రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష

ం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన అధికారులు

తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి: శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని తెలంగాణ డీఐజీ జోయల్ డేవిస్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ డీఐజీకి స్వాగతం పలకగా, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణతోపాటు అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక వసతులను డీఐజీ పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణలో ఎదురవుతున్న సాంకేతిక, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని ప్రస్తుత, పాత నేరాలకు సంబంధించిన రికార్డులు, విచారణలో ఉన్న కేసులు, పెండింగ్ కేసుల పురోగతిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతోపాటు బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. తనిఖీల అనంతరం డీఐజీ జోయల్ డేవిస్, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్‌తో కలిసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మధుసూదన్‌రెడ్డి, చౌటుప్పల్ రూరల్, టౌన్ సీఐలు జి. మన్మథకుమార్, డి. సతీష్‌రెడ్డి, రామన్నపేట సీఐ రవి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ జగన్, ఎస్ఐ లైలా, స్టేషన్ రైటర్ వెంకన్న, ఏఎస్ఐలు శంకర్‌నాయక్, మధుసూదన్‌రెడ్డి, జమేదారులు యాదగిరి, శ్రీనివాసులు, రమేష్, సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, వినోద్, రాజశేఖర్, నరేష్, లలిత, సరస్వతి, స్వర్ణ, హోంగార్డు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

ం నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో 36వ జాతీయ మహాసభలు

ం ఇంటింటి ప్రచారంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండమడుగు నరసింహ పిలుపు

తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి : నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండమడుగు నరసింహ, తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకుడు గూడూరు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం భూదాన్ పోచంపల్లి మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో మహాసభల విజయవంతానికి వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండమడుగు నరసింహ మాట్లాడుతూ.. అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించి 90 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా రైతాంగ సాయుధ పోరాటానికి కేంద్రంగా నిలిచిన నల్లగొండలో జాతీయ మహాసభలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుందని అన్నారు. ఈ మహాసభల సందర్భంగా సుమారు 15 లక్షల మంది రైతులతో భారీ ప్రదర్శన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని 28 రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వాటిని ఎదుర్కోవడానికి ఐక్య ఉద్యమాలే మార్గమని అన్నారు. రైతుల సమస్యలపై భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందించి, రైతాంగానికి అండగా నిలిచేందుకు ఈ మహాసభలు దోహదపడతాయని తెలిపారు. కార్మికులు, కర్షకులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కోట రామచంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గూడూరు బుచ్చిరెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, నాయకులు పత్తి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విదేశీయులను ఆకట్టుకున్న పోచంపల్లి చేనేత కళ

ం చేనేత మ్యూజియాన్ని సందర్శించిన అమెరికా పర్యాటకుల బృందం

ం ఆసు పోయడం, మగ్గంపై నేత పనితీరును ఆసక్తిగా పరిశీలన

ం నేత కార్మికుల నైపుణ్యంపై ప్రశంసలు

తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భూదాన్ పోచంపల్లి ఇక్కత్ చేనేత వస్త్రకళ విదేశీ పర్యాటకులను ఆకట్టుకుంది. అమెరికాకు చెందిన తొమ్మిది మంది సభ్యుల పర్యాటక బృందం గురువారం పోచంపల్లి పట్టణంలోని టూరిజం పార్కులో ఉన్న చేనేత మ్యూజియాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని ఆసక్తిగా పరిశీలించింది. మ్యూజియంలో చేనేత కార్మికులు ఆసు పోయడం, మగ్గంపై వస్త్రాలు నేసే విధానాన్ని విదేశీ పర్యాటకులు నిశితంగా తిలకించారు. స్థానిక నేత కార్మికులతో మాట్లాడి నూలు దారాల ఎంపిక నుంచి రంగులు అద్దడం, ప్రత్యేకమైన డిజైన్లతో వస్త్రాలు తయారు చేసే వరకు ప్రతి దశ గురించి వివరాలు తెలుసుకున్నారు. తక్కువ ముడిసరుకుతో ఎంతో నైపుణ్యంతో ఆకర్షణీయమైన వస్త్రాలను రూపొందిస్తున్న కార్మికుల పనితీరును ప్రశంసించారు. అనంతరం పట్టణంలోని వివిధ చేనేత వస్త్ర విక్రయశాలలను సందర్శించి పలు రకాల పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను కొనుగోలు చేశారు. పోచంపల్లి చేనేత కళలోని ప్రత్యేకత, నేత కార్మికుల నైపుణ్యం అద్భుతంగా ఉన్నాయని ఈ సందర్భంగా అమెరికా పర్యాటకులు కొనియాడారు. ఈ పర్యటనతో పోచంపల్లి చేనేత కళకు అంతర్జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు లభించింది.

నేల ఆరోగ్య పరిరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

ం తంగిడిగిలో 'ఖేతి బచావో అభియాన్' సదస్సు

ం పచ్చిరొట్ట, ప్రత్యామ్నాయ పంటలపై ఏవో సుదర్శన్ గౌడ్ సూచనలు

తొలివెలుగు, కృష్ణ : నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే సుస్థిర వ్యవసాయం, అధిక దిగుబడులు సాధ్యమవుతాయని మండల వ్యవసాయ అధికారి (ఏవో) సుదర్శన్ గౌడ్ అన్నారు. కృష్ణ మండల పరిధిలోని తంగిడిగి గ్రామంలో గురువారం 'ఖేతి బచావో అభియాన్' సాగు భూమి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ... పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయడం ద్వారా నేలలో సేంద్రియ పదార్థాల శాతాన్ని, నేల సారవంతతను మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. పొలాల్లో వరి కొయ్యలను దహనం చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ... కొయ్యలను కాల్చడం వల్ల నేలలో ఉండే మిత్ర పురుగులు, ఉపయోగకర సూక్ష్మజీవులు నశించి పర్యావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. వాటిని కాల్చకుండా పొలంలోనే కలియదున్ని కుళ్లింపజేయడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు.

యాసంగిలో ఆరతడి పంటలే మేలు

'ఎల్ నినో' ప్రభావంతో వాతావరణంలో మార్పులు సంభవించి వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రణాళికలు వేసుకోవాలన్నారు. రాబోయే యాసంగి సీజన్లో నీటి వినియోగం తక్కువగా ఉండే పప్పుధాన్యాలు, ఇతర ఆరతడి పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగప్ప, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) బి. అభిలాష్, ఎమ్. రవికుమార్, గ్రామానికి చెందిన రైతులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

పెదరావులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ం రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం: పీఏసీఎస్ చైర్మన్ కళ్లెం రాఘవరెడ్డి

ం దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని జూలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ కళ్లెం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని పెదరావులపల్లి గ్రామంలో గురువారం జూలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు తాము కష్టపడి పండించిన పంటను దళారులకు తక్కువ ధరకు విక్రయించి మోసపోవద్దని కోరారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాలుకు రూ. 2,400కు పైగా మద్దతు ధర అందిస్తోందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, పెదరావులపల్లి గ్రామ సర్పంచ్ మోటె బాలకృష్ణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మక్తాల రమేష్, సీనియర్ నాయకులు మలిపెద్ది అంబరీష్ రెడ్డి, డైరెక్టర్లు జడల అంజయ్య, పల్లె విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు చేగురి ప్రభాకర్, మట్ట సుదర్శన్ గౌడ్, ఇన్‌ఛార్జ్ సీఈఓ ఐతే రాజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక
TOLE VELUGGU JATIYAPATRIKA
యాదాద్రి భువనగిరి శుక్రవారం 30 అక్టోబర్ 2026

వారం రోజులుగా బొందుగులకు తాగునీరు బంద్!

- మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం.. మరమ్మతులు చేపట్టని అధికారులు
- నీటి సరఫరా లేక గ్రామస్తుల అవస్థలు
- పలుమార్లు విన్నవించినా స్పందన లేదంటున్న సర్పంచ్

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం బొందుగుల గ్రామంలో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయినా అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం గ్రామ సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య, పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు మాట్లాడుతూ.. బొందుగుల సబ్‌స్టేషన్ సమీపంలో ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ జేసీబీతో పనులు చేపడుతుండగా మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమైనట్లు తెలిపారు. దీంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. వారం రోజులుగా సమస్య కొనసాగుతున్నా అధికారులు పైపులైన్ మరమ్మతులు చేపట్టకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ స్పందన లేదని సర్పంచ్ ఎల్లయ్య పేర్కొన్నారు. తాగునీరు అందక గ్రామ ప్రజలు నిత్యావసరాలకు నీటిని సమకూర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి గ్రామానికి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సర్పంచ్, గ్రామస్తులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

- చల్లూరు, రేణిగుంట, రఘునాథపురంలో కేంద్రాల ప్రారంభం
- గ్రేడ్-ఏకు క్వింటాల్‌కు రూ.2,461, గ్రేడ్-బీకి రూ.2,441
- సన్నధాన్యానికి రూ.500 బోనస్ అందజేత

తొలివెలుగు, రాజాపేట: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకునేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. గురువారం రాజాపేట మండలంలోని చల్లూరు, రేణిగుంట, రఘునాథపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రేణిగుంటలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ నామిల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభించారు. చల్లూరు, రఘునాథపురంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, గ్రేడ్-బీ ధాన్యానికి రూ.2,441 చెల్లించనున్నట్లు తెలిపారు. సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నామిల మహేందర్ గౌడ్, ఏవో మాధవి, తహసీల్దార్ గోలి రవికిరణ్, సర్పంచులు భీమగాని రూప బాలనరసయ్య, పల్లె సంతోష్, ఉప సర్పంచులు బొంత సుధాకర్, కల్లెం పాండు, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఇంజ నరేష్, ఆర్కాల గాల్‌రెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి సిల్వర్ చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం మురారీ, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, గ్రామాల వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ, ఆత్మ, మదర్ డెయిరీ డైరెక్టర్లు, ఏఈవోలు, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇక కబ్జా కుదరదు.. ఆర్.కె.పురం చెరువుకు 'హైడ్రా' కంచె

- ఆర్.కె.పురం చెరువులో 12 ఎకరాల ఆక్రమణల తొలగింపు
- భవిష్యత్తులో కబ్జాలకు ఆస్కారం లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు
- స్థానికుల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు
- అక్రమ పందుల వధశాలలు, ప్రీకాస్ట్ గోడల కూల్చివేత
- చెరువు ఎఫ్‌టీఎల్ భూమి అని సూచిస్తూ బోర్డుల ఏర్పాటు

తొలివెలుగు,హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఆర్.కె.పురం చెరువు ఆక్రమణల పర్వానికి హైడ్రా (న్ణ=ూూా) గురువారం శాశ్వత అడ్డుకట్ట వేసింది. భవిష్యత్తులో మళ్లీ కబ్జాలకు ఆస్కారం లేకుండా చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో పటిష్ఠమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఆక్రమణల సమస్యకు ఈ చర్యతో పరిష్కారం లభించినట్లయింది. ఈ కార్యక్రమానికి ముందు, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు తొలగించారు. కొందరు వ్యక్తులు ప్రీకాస్ట్ గోడలు, కంచెలు వేసుకుని తమ ఆధీనంలోకి తీసుకున్న భూములను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన పందుల వధశాలలను (కబేళాలను) కూడా కూల్చివేసి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. స్థానికంగా మినీ ట్యాంక్‌బండ్‌గా పేరుగాంచిన ఆర్.కె.పురం చెరువు (ముక్కిడికుంట) కొంతకాలంగా కాలుష్యం, కబ్జాలతో కునారిల్లుతోంది. చెరువు పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, పందులను వధించి వ్యర్థాలను చెరువులోనే పారబోయడం వంటి సమస్యలపై స్థానికులు 'ప్రజావాణి'లో పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అధికారులు, ఆక్రమణలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మౌలాలి సర్కిల్ పరిధిలో ఉన్న ఈ చెరువు మొత్తం విస్తీర్ణం 75 ఎకరాలు. ఇప్పటికే ఇందులో 11 ఎకరాల మేర శాశ్వత నిర్మాణాలు వెలిశాయి. తాజాగా మరో 12 ఎకరాలను కూడా ఆక్రమించే ప్రయత్నాలు జరగడంతో హైడ్రా రంగంలోకి దిగింది. ఆక్రమణల తొలగింపుతో పాటు, ఇది చెరువు ఎఫ్‌టీఎల్ భూమి అని స్పష్టంగా తెలియజేస్తూ అధికారులు ప్రత్యేకంగా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ చర్యతో మినీ ట్యాంక్‌బండ్‌కు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు, పర్యావరణాన్ని కాపాడేందుకు మార్గం సుగమమైందని స్థానికులు భావిస్తున్నారు.

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

- ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్ నాగ్‌పూర్‌లోనే బీజేపీని ఓడించామన్న మహేశ్ గౌడ్
- మోదీ నియోజకవర్గం వారణాసిలోనూ బీజేపీ ఓటమి పాలైందని వెల్లడి
- ధైర్యముంటే మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని సవాల్
- రాబోయే ఎన్నికల్లో బీజేపీకి వంద సీట్లు కూడా రావని జోస్యం
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తప్పవు
- బిల్లుల కోసం చావడానికి కూడా సిద్ధమేనన్న అనిరుధ్ రెడ్డి
- నిధుల కొరత రాష్ట్రవ్యాప్తంగా ఉందన్న పీసీసీ చీఫ్

"ఎన్ని గెలిచామన్నది కాదు, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యం. బీజేపీ అబ్బ అయిన ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్‌లోనే బీజేపీని ఓడించి, బ్యాలెట్ ద్వారా బుల్లెట్ దింపాం" అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఆయన గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ నియోజకవర్గమైన వారణాసి, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్‌లలో బీజేపీ ఓటమిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. నాగ్‌పూర్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిజిత్ వంజారి, బీజేపీ అభ్యర్థి సుధాకర్ కోహ్లేపై 3,271 ఓట్ల తేడాతో విజయం సాధించారని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. బీజేపీకి కంచుకోటలాంటి, కేంద్ర మంత్రి గడ్కరీ, ఫడ్నవీస్ వంటి నేతలు ప్రచారం చేసిన నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ గెలవడం సాధారణ విషయం కాదన్నారు. ఇది బీజేపీ సిద్ధాంతాన్ని అక్కడి విద్యావంతులు, యువత తిరస్కరించడానికి నిదర్శనమని పేర్కొన్నారు. వారణాసిలో ఓటమి మోదీ పాలనపై ప్రజా వ్యతిరేకతను సూచిస్తోందని, ఈ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మోదీ తన వైఫల్యాలను అంగీకరించాలని డిమాండ్ చేశారు. ధైర్యముంటే ఈ ఫలితాలపై మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని, గత 12 ఏళ్లుగా ఒక్క మీడియా సమావేశం కూడా నిర్వహించని ప్రధాని కేవలం ట్వీట్లకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఓడిపోతే ప్రభుత్వ వ్యతిరేకత అనే బీజేపీ, వారణాసిలో ఓటమిని ఎందుకు మోదీకి వ్యతిరేకంగా చూడదని ప్రశ్నించారు. లక్నో నుంచి పట్నా వరకు బీజేపీకి ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సొంత ప్రాంతమైన గోరఖ్‌పూర్‌లో కేవలం 307 ఓట్ల మెజారిటీతో గెలవడమే దీనికి నిదర్శనమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మూడంకెల సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీయేతర శక్తులకు ప్రజా మద్దతు పెరుగుతోందని, ఆయనే తదుపరి ప్రధాని అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఓట్ల దొంగతనం'ను నిరసిస్తూ నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన చేపట్టనున్నామని, జాబితా నుంచి తొలగించిన 13.3 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీకి అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనిరుధ్ రెడ్డికి త్వరలోనే నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని సూచించారు. "జడ్చర్లలో నేను చస్తేనే బిల్లులు వస్తాయంటే... నియోజకవర్గ అభివృద్ధి కోసం చనిపోవడానికైనా సిద్ధం" అని అనిరుధ్ రెడ్డి ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్న ఈ వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ... నిధుల కొరత ఒక్క జడ్చర్లలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉందని, ఇలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్ల కోసం దరఖాస్తు చేస్తే, దక్షిణ మధ్య రైల్వే సాకులు చెప్పి తిరస్కరిస్తోందని మహేశ్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పేరు చెబితేనే బీజేపీ వణికిపోతోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ నుంచి కార్యకర్తలను ఢిల్లీకి తీసుకెళ్లి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఖ

బాధిత కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ ఆసరా

- దూది వెంకటాపురంలో మృతుని కుటుంబానికి బియ్యం పంపిణీ
- కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చిన స్థానిక నాయకులు

తొలివెలుగు, రాజాపేట: నిరుపేద కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ అండగా నిలిచింది. రాజాపేట మండలం దూది వెంకటాపురం గ్రామానికి చెందిన బింగి ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి బియ్యం అందజేశారు. కష్టకాలంలో నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మంగ కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోరుకొప్పుల శ్రీధర్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ గొడిశెల నరసింహులు, రాజాపేట మండల సేవాదళ్ అధ్యక్షుడు గొడిశెల నాగేష్, సామాజిక మాధ్యమాల కన్వీనర్ భీమగాని కరుణాకర్, యూత్ నాయకుడు గొడిశెల కరుణాకర్, గ్రామ సీనియర్ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

తుపానుతో కోనసీమ జిల్లాలో వేలాది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి: మంత్రి గొట్టిపాటి

- ౦ అర్నబ్ తుపానుతో కోస్తా జిల్లాలు అతలాకుతలం
- ౦ వేలాదిగా నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- ౦ పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్
- ౦ సాయంత్రంలోగా విద్యుత్ పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశం
- ౦ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

అర్నబ్' తుపాను కోస్తా జిల్లాల్లో, ముఖ్యంగా కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెను విధ్వంసం సృష్టించింది. గంటల వ్యవధిలో వేలాది విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరగడంతో పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిపోయింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, రహదారులపై చెట్లు విరిగిపడి రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వయంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. దెబ్బతిన్న రహదారులు, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ఆయన, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వేల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని వెల్లడించారు. నేటి సాయంత్రానికల్లా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని, రహదారులపై పడిన చెట్లను తక్షణమే తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడటంతో పాటు, పంట నష్టం అంచనాలను వెంటనే ప్రారంభించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తుపాను బాధితులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో జిల్లా పార్టీ అధ్యక్షుడు మంతెన రామరాజు, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. మరోవైపు కోనసీమ జిల్లాలో తుపాను ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. వేలాది విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. క్షేత్రస్థాయిలో అడ్డంకులను తొలగిస్తూ, దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తూ అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. ప్రతి ఇంటికీ తిరిగి విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

పింఛన్ల పంపిణీలో టీడీపీ జోక్యం వద్దు: ఎన్నికల సంఘానికి వైసీపీ ఫిర్యాదు

- ౦ పింఛన్ల పంపిణీపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు వైసీపీ ఫిర్యాదు
- ౦ టీడీపీ నేతలు ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఆందోళన
- ౦ పంపిణీ కార్యక్రమానికి టీడీపీ నేతలను దూరంగా ఉంచాలని వినతి

పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుపెట్టుకుని తెలుగుదేశం పార్టీ నేతలు ఓటర్లను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని వైసీపీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ తరుణంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు లేఖ రాసింది. అక్టోబర్ 30వ తేదీన జరగనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తన లేఖలో కోరారు. పింఛన్ల పంపిణీని అధికార పార్టీ తమ ఎన్నికల ప్రచారానికి వాడుకునే అవకాశం ఉందని, దీనిని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. "పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తిగా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారానే జరిగేలా ఆదేశాలు ఇవ్వాలి. లబ్ధిదారులను అధికార పార్టీకి అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలను నిరోధించాలి. దీనిపై జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు, ఎన్నికల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలి" అని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పింఛన్ల పంపిణీ ప్రారంభం కాకముందే ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని అప్పిరెడ్డి కోరారు.

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన.. వెనక్కి తగ్గేది లేదన్న ఖర్గే

ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు. పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్ గాంధీని కోరాయి. పెద్ద ఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతో పాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు. మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు.

డబ్బు దాచుకోవడం దండగేనా? భవిష్యత్తులో అసలు పొదుపే అవసరం ఉండదంటున్న ఎలాన్ మస్క్..

- ౦ భవిష్యత్తు కోసం పొదుపు చేయడం నిరర్థకమవుతుందన్న ఎలాన్ మస్క్
- ౦ సూపర్ ఇంటెలిజెంట్ ఏఐ, రోబోలు వస్తువులు, సేవల ఉత్పత్తిని పెంచుతాయని అంచనా
- ౦ ఉత్పత్తి విపరీతంగా పెరిగితే డబ్బు ప్రాధాన్యం తగ్గవచ్చని అభిప్రాయం
- ౦ 2036 నాటికి డబ్బు విలువ తగ్గవచ్చని గతంలోనూ మస్క్ అంచనా
- ౦ భవిష్యత్తులో ఉద్యోగం చేయడం ఐచ్ఛికంగా మారవచ్చని భావన

భవిష్యత్తు కోసం డబ్బు పొదుపు చేస్తున్నారా? అయితే ఇకపై అలా చేయాల్సిన అవసరమే ఉండకపోవచ్చని అంటున్నారు ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్. కృత్రిమ మేధ (ఏఐ), రోబోలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మార్చేస్తాయని, భవిష్యత్తులో వస్తువులు, సేవలు సమృద్ధిగా అందుబాటులోకి వస్తాయని ఆయన అంచనా వేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తు కోసం డబ్బు దాచుకోవడం అర్థరహితంగా మారుతుందని తాజాగా సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికపై ఓ యూజర్ చేసిన వ్యాఖ్యకు స్పందిస్తూ మస్క్ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సూపర్ ఇంటెలిజెంట్ ఏఐ అందుబాటులోకి వస్తే, భవిష్యత్తు కోసం డబ్బు పొదుపు చేయడం నిరర్థకమవుతుందని పేర్కొన్నారు. మస్క్ వాదన ప్రకారం.. ప్రస్తుతం మనుషులు ఆహారం, ఇల్లు, రవాణా, వైద్యం, వినోదం వంటి అవసరాల కోసం డబ్బు సంపాదిస్తున్నారు. అయితే అత్యాధునిక ఏఐ వ్యవస్థలు, హ్యూమనాయిడ్ రోబోలు ఈ వస్తువులను, సేవలను భారీ స్థాయిలో ఉత్పత్తి చేయగలిగితే వాటి ధరలు గణనీయంగా తగ్గవచ్చు. ప్రజల అవసరాలకు మించి ఉత్పత్తి జరిగే పరిస్థితి వస్తే డబ్బు ప్రాధాన్యం కూడా తగ్గిపోతుందని ఆయన భావిస్తున్నారు. గతంలోనూ మస్క్ ఇలాంటి అంచనాలే వేశారు. 2026 జులైలో 'ది ఎకనామిస్ట్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఏఐ, రోబోలు మానవులు వినియోగించగల పరిమాణానికి మించి వస్తువులు, సేవలను అందించగలిగితే 2036 నాటికి డబ్బు ప్రాధాన్యం గణనీయంగా తగ్గవచ్చని అన్నారు. ఏఐ అభివృద్ధి ఇదే వేగంతో కొనసాగితే సుమారు ఐదేళ్లలో అది మానవాళి మొత్తం మేధస్సును మించవచ్చని కూడా ఆయన అంచనా వేశారు. ఏఐ, రోబోలు అనేక పనులను మనుషుల కంటే వేగంగా, తక్కువ ఖర్చుతో చేయగలిగితే ఉద్యోగాల స్వరూపం మారుతుందని మస్క్ చెబుతున్నారు. భవిష్యత్తులో జీవనాధారం కోసం తప్పనిసరిగా ఉద్యోగం చేయాల్సిన అవసరం తగ్గవచ్చని, ఇష్టముంటేనే పని చేసే పరిస్థితి రావచ్చని ఆయన అభిప్రాయం. ప్రభుత్వాలు ప్రజలకు నేరుగా ఆదాయం అందించే విధానాలను అనుసరించాల్సి రావచ్చని కూడా గతంలో సూచించారు. అయితే ఇలాంటి వ్యవస్థలు ఎలా అమలవుతాయి? ఉద్యోగాలు కోల్పోయేవారికి ఆదాయం ఎలా అందుతుంది? ఏఐ సృష్టించే సంపద అందరికీ సమానంగా చేరుతుందా? అనే ప్రశ్నలకు ఇంకా స్పష్టమైన సమాధానాలు లేవు. మస్క్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా ఉన్నప్పటికీ, వాటిని ఆధారంగా చేసుకుని పొదుపు ఆపేయడం సరైన నిర్ణయం కాదు. ఏఐ వల్ల ఉత్పత్తి పెరిగినా దాని ప్రయోజనాలు అందరికీ ఒకేలా అందుతాయని హామీ లేదు. ఆర్థిక అసమానతలు, ఉద్యోగాల్లో మార్పులు, వైద్యం, గృహ వసతి వంటి సేవల లభ్యత కూడా కీలకంగా ఉంటాయి. కాబట్టి మస్క్ చెబుతున్నది భవిష్యత్తుపై ఆయనకున్న ఆశావాద దృక్పథం మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర అవసరాలు, కుటుంబ బాధ్యతలు, పదవీ విరమణ వంటి లక్ష్యాల కోసం ఆర్థిక ప్రణాళికను కొనసాగించడం ముఖ్యమని సూచిస్తున్నారు. ఏఐ ప్రపంచాన్ని ఎంతగా మార్చుతుందో కాలమే నిర్ణయించాలని అభిప్రాయపడ్డారు.

తుపాను బాధితులకు అండగా నిలవండి: పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు

- ౦ ప్రభుత్వ సహాయక చర్యలు పూర్తిగా విఫలమయ్యాయని జగన్ విమర్శ
- ౦ టీడీపీ నేతలు బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ
- ౦ సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని వ్యాఖ్య

అర్నబ్ తుపాను బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలవాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సహాయక చర్యలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికార పార్టీ నేతలు 'బియ్యం మాఫియా'ను ప్రోత్సహిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... 'గ్రామ, వార్డు సచివాలయాల నిర్వీర్యం, వాలంటీర్ల వ్యవస్థ రద్దు ప్రభావం తుపాను సహాయక చర్యలపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం విపత్తులను ఆదాయ వనరుగా మార్చుకోవాలనుకుంటోంది' అని విమర్శించారు. సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని కీలక నేతలే బియ్యం ధరల పెరుగుదలకు కారణమని ఆరోపించారు. 'మంత్రి పయ్యావుల వియ్యంకుడు సహా టీడీపీ నేతలు బియ్యాన్ని మార్కెట్లోకి రానీయకుండా బ్లాక్ చేసి, ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారు' అని జగన్ వ్యాఖ్యానించారు. తుపాను కారణంగా వరి, ఆక్వా, పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ క్లిష్ట సమయంలో బాధితులకు తోడుగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ధాన్యం సేకరణలో రైతులకు అండగా ఉంటూ, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని జగన్ స్పష్టం చేశారు.

తిరుమలలో నీటి కొరత లేదు: టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

- తిరుమలలో 150 రోజులకు సరిపడా నీటి నిల్వలు
- వర్షాలు ఆలస్యమైనా ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు
- డ్యామ్‌లను పరిశీలించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు
- నీటి భద్రతకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడి
- సీఎం చంద్రబాబు దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లినట్లు వెల్లడి

తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక భరోసా ఇచ్చింది. కొండపై రానున్న 150 రోజుల వరకు తాగునీటికి ఎలాంటి ఢోకా లేదని స్పష్టం చేసింది. వర్షాలు ఆలస్యమైనప్పటికీ, భక్తులకు నీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠమైన ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. గురువారం ఆయన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తిరుమలకు నీటిని సరఫరా చేసే ప్రధాన జలాశయాలను పరిశీలించారు. గోగర్భం, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార డ్యామ్‌లలో నీటి నిల్వలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ, "ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు సుమారు 150 రోజులకు సరిపోతాయి. ఒకవేళ వర్షాలు ఆలస్యమైనా నీటి కొరత రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం" అని వివరించారు. ఇటీవల ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఛైర్మన్ వెల్లడించారు. వర్షాలు సకాలంలో కురుస్తాయని, నీటి సమస్య ఉండదనే విశ్వాసాన్ని సీఎం వ్యక్తం చేశారని నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని, కల్యాణి డ్యామ్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా నీటి సరఫరాను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తిరుమలలో నీటి భద్రతకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇందులో భాగంగా డ్యామ్‌లలో పూడికతీత (డ్రెడ్జింగ్), చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నీటి లీకేజీల నివారణ, నీటి సరఫరా వ్యవస్థ ఆటోమేషన్ వంటి పనులను చేపట్టనున్నట్లు వివరించారు. లక్షలాది మంది శ్రీవారి భక్తులకు నిరంతరాయంగా, స్వచ్ఛమైన నీటిని అందించడమే తమ బాధ్యత అని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు.

రెబెల్స్ పై వెంటనే వేటు వేయండి: చంద్రబాబు ఆదేశం

- పొత్తు ధర్మాన్ని తప్పనిసరిగా పాటించాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- ఎన్డీఏ రెబల్ అభ్యర్థులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశం
- అభ్యర్థులను కాకుండా ఎన్డీఏను చూసి ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి

పొత్తు ధర్మాన్ని ఎలాంటి పునరాలోచన లేకుండా పాటించాల్సిందేనని, ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్న రెబల్ అభ్యర్థులను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... తాను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కలిసి ఎంతో శ్రమించి సీట్ల సర్దుబాటు పూర్తి చేశామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు, నేతలకు దీనిపై సానుకూల సందేశం పంపామని, కాబట్టి ఓటర్లు అభ్యర్థులను కాకుండా ఎన్డీఏ కూటమిని చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ చర్చలో జోక్యం చేసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముగ్గురు నేతలు కలిసికట్టుగా తీసుకున్న నిర్ణయంపై ప్రజలు, కార్యకర్తల నుంచి సానుకూల స్పందన వచ్చిందని అన్నారు. మంత్రులు కేవలం తమ నియోజకవర్గాలపైనే కాకుండా, వారికి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న జిల్లాల బాధ్యతలను కూడా తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు బాధ్యత మంత్రులదేనని తేల్చిచెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తర్వాత పంచాయతీ, సొసైటీ ఎన్నికలు వస్తాయని, వాటికి ఇప్పటినుంచే సిద్ధం కావాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ఏవైనా వివాదాలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని, ఆ తర్వాత ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



విలేకరిపై డొనాల్డ్ ట్రంప్ బాడీ షేమింగ్..

- ఆరోగ్యంపై ప్రశ్నించిన రాయిటర్స్ జర్నలిస్టుపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం
- విలేకరి శరీరాకృతిని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు
- కాన్సాస్, ఐయోవా రాష్ట్రాల్లో జరగాల్సిన రెండు మధ్యంతర ఎన్నికల ర్యాలీల రద్దు
- ప్రయాణాలతో అలసిపోయారా? అన్న ప్రశ్నకు వ్యక్తిగత దాడితో బదులు
- టెలీ-ర్యాలీల ద్వారా ఎక్కువ మందికి చేరువవ్వేందుకే ఈ నిర్ణయమన్న ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మీడియా ప్రతినిధిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఆరోగ్యం, రద్దయిన ఎన్నికల ర్యాలీల గురించి ప్రశ్నించిన రాయిటర్స్ విలేకరిపై వ్యక్తిగత దాడికి దిగారు. అతడి శరీరాకృతిని కించపరిచేలా "అసహ్యంగా ఉన్నావు", "చూడటానికి భయంకరంగా ఉన్నావు" అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన గురువారం మేరీల్యాండ్‌లోని జాయింట్ బేస్ ఆండ్రూస్ వద్ద చోటుచేసుకుంది. సౌత్ కరోలినాలో ప్రచార ర్యాలీ ముగించుకుని తిరిగి వస్తున్న ట్రంప్‌ను రాయిటర్స్ వైట్‌హౌస్ కరస్పాండెంట్ జాకబ్ బోగేజ్ పలకరించారు. కొన్ని వారాలుగా నిరంతరాయంగా ప్రయాణిస్తున్నందున, మీ ఆరోగ్యం ఎలా ఉందని మొదట ప్రశ్నించారు. అనంతరం "ప్రయాణాలతో విసిగిపోవడం వల్లే కాన్సాస్ ర్యాలీని రద్దు చేశారా?" అని అడగటంతో ట్రంప్ ఒక్కసారిగా సహనం కోల్పోయారు."అలాంటి ప్రశ్న అడిగినందుకు నీకే అనారోగ్యంగా ఉండాలి. నువ్వు ఒక రోగివి. ఏ సంస్థ నీది?" అని ట్రంప్ మండిపడ్డారు. రాయిటర్స్ అని తెలియగానే "రాయిటర్స్ ఒక చెత్త సంస్థ. ఈ వ్యక్తిని చూడండి. అతడి శరీరాకృతి దారుణంగా ఉంది. రెండు వారాలుగా నన్ను అనుసరిస్తున్నావు కదా, నేను చాలా ఆరోగ్యంగా ఉన్నాను. నువ్వు అసహ్యంగా ఉన్నావు. ముందు నీ శరీరాన్ని అదుపులో పెట్టుకో. చూడటానికి భయంకరంగా ఉన్నావు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా కాన్సాస్‌లోని సలీనాలో సెనేటర్ రోజర్ మార్షల్‌కు మద్దతుగా శనివారం, ఐయోవాలోని డుబుక్‌లో ఆదివారం జరగాల్సిన ర్యాలీలను ట్రంప్ రద్దు చేసుకున్నారు. దీనిపై వివరణ ఇస్తూ, కాన్సాస్‌లో మార్షల్ గెలుపు ఖాయమని, అందుకే అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని భావిస్తున్నానని చెప్పారు. ప్రత్యక్ష ర్యాలీల బదులు టెలీ-ర్యాలీల ద్వారా ఎక్కువ మంది ఓటర్లకు చేరువవ్వేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇది ఒక వ్యూహాత్మక ఎత్తుగడ అని ఆయన పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా ట్రంప్ సుదీర్ఘ ప్రచార ర్యాలీల్లో పాల్గొంటుండటంతో ఆయన గొంతు బొంగురుపోయింది. నిరంతరం ర్యాలీలు చేయడం వల్ల తన స్వరపేటికపై ఒత్తిడి పడుతోందని ఆయనే గతంలో వ్యాఖ్యానించారు. దశాబ్దాలుగా డెమోక్రటిక్ సెనేటర్‌ను ఎన్నుకోని కాన్సాస్‌లో ఈసారి పోటీ గట్టిగా ఉండటంతో, ప్రత్యర్థి అభ్యర్థికి ఆధిక్యం ఉన్నట్లు కొన్ని సర్వేలు సూచిస్తున్నాయి.

దర్భంగా గ్రాడ్యుయేట్స్ స్థానాన్ని కైవసం చేసుకున్న ఆర్జేడీ

- దర్భంగా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానంలో ఆర్జేడీ అభ్యర్థి అనిల్ కుమార్ ఝూ గెలుపు
- తొలుత వెనుకంజలో ఉన్నా రెండో ప్రాధాన్యత ఓట్లతో అనూహ్యంగా విజయం
- సిట్టింగ్ ఎమ్మెల్సీ, బీజేపీ అభ్యర్థి సర్వేశ్ కుమార్‌పై 4,010 ఓట్ల తేడాతో గెలుపు
- దాదాపు 60 గంటల పాటు కొనసాగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ
- జన్ సురాజ్ పార్టీ అభ్యర్థి ఓట్ల బదిలీతో మారిన సమీకరణాలు

బిహార్ శాసనమండలి ఎన్నికల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. దర్భంగా గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాన్ని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) అభ్యర్థి అనిల్ కుమార్ ఝూ కైవసం చేసుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ, బీజేపీ అభ్యర్థి సర్వేశ్ కుమార్‌పై ఆయన విజయం సాధించారు. దాదాపు 60 గంటల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో రెండో ప్రాధాన్యత ఓట్లు ఫలితాన్ని తారుమారు చేశాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆరంభం నుంచి ఆర్జేడీ అభ్యర్థి అనిల్ కుమార్ ఝూ వెనుకంజలోనే ఉన్నారు. 38వ రౌండ్ ముగిసేసరికి, బీజేపీ అభ్యర్థి సర్వేశ్ కుమార్ 20,033 ఓట్లతో, 19,029 ఓట్లు పొందిన ఝూపై 1,004 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. అయితే, జన్ సురాజ్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ ఇంతియాజ్ నూరానీ పోటీ నుంచి ఎలిమినేట్ కావడంతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. నూరానీకి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను బదిలీ చేయగా, అందులో సుమారు 2,900 ఓట్లు ఝూకు, 1,363 ఓట్లు కుమార్‌కు లభించాయి. దీంతో ఒక్కసారిగా ఝూ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. తుది ఫలితాల్లో అనిల్ కుమార్ ఝూకు 25,406 ఓట్లు, సర్వేశ్ కుమార్‌కు 21,396 ఓట్లు పోలయ్యాయి. దీంతో 4,010 ఓట్ల మెజారిటీతో ఝూ గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి, దర్భంగా డివిజనల్ కమిషనర్ హిమాన్షు కుమార్ రాయ్ ప్రకటించారు. అనంతరం ఝూకు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కౌంటింగ్ కేంద్రంలోనే సర్వేశ్ కుమార్.. విజేత అనిల్ కుమార్ ఝూను అభినందించారు. ఈ నెల 23న జరిగిన ఈ ఎన్నికల బరిలో మొత్తం 40 మంది అభ్యర్థులు నిలిచారు. ఈ విజయంతో దర్భంగా పరిధిలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ కోల్పోయినట్లయింది. మొత్తం 8 పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, ఆర్జేడీ చెరో రెండు స్థానాలు గెలుచుకోగా.. జేడీయూ, జన్ సురాజ్ పార్టీ ఒక్కో స్థానంలో, ఇద్దరు స్వతంత్రులు రెండు స్థానాల్లో విజయం సాధించారు.

చాట్‌జీపీటీ సలహా యువ ఇంజనీర్ ప్రాణం తీసిందా?.. ఓపెన్‌ఏఐపై యువతి తల్లిదండ్రుల దావా!

- చాట్‌జీపీటీ వైద్య సలహా పాటించి యువతి మృతి చెందిందని ఆరోపణ
- మృతురాలి తల్లిదండ్రులు ఓపెన్‌ఏఐ సంస్థపై దావా వేసిన వైనం
- మూర్ఛ వ్యాధి మందులను ఆపేయమని ఏఐ ప్రోత్సహించిందని ఆరోపణ
- వైద్యులను సంప్రదించవద్దని కూడా చాట్‌బాట్ సూచించినట్లు కేసులో వెల్లడి
- ఇది పాత వెర్షన్ వల్ల జరిగిందని ఓపెన్‌ఏఐ వివరణ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చాట్‌బాట్ అయిన చాట్‌జీపీటీ ఇచ్చిన వైద్య సలహా పాటించడం వల్లే తమ కుమార్తె మరణించిందని ఆరోపిస్తూ ఓ జంట టెక్ దిగ్గజం ఓపెన్‌ఏఐపై దావా వేసింది. ఈ విషాద ఘటన అమెరికాలోని సియాటెల్‌లో చోటుచేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు దాఖలు చేసిన ఈ కేసు, వైద్యపరమైన విషయాల్లో ఏఐపై ఆధారపడటంలోని ప్రమాదాలపై తీవ్ర చర్చను రేకెత్తిస్తోంది. సియాటెల్‌కు చెందిన బోవెన్ వాన్ (31) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చాలాకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె తన అనారోగ్య నియంత్రణకు లామోట్రిజిన్ అనే మందును వాడుతున్నారు. అయితే, ఈ మందుల సైడ్ ఎఫెక్ట్స్ తన ఆలోచనా శక్తి, మాటతీరుపై ప్రభావం చూపుతున్నాయని ఆమె ఆందోళన చెందారు. దీనికితోడు ఆమె పనిచేస్తున్న అమెజాన్ సంస్థలో ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఏర్పడటంతో మరింత ఒత్తిడికి గురయ్యారు. ఈ క్రమంలో ఆమె చాట్‌జీపీటీని ఆశ్రయించారు. తన మందుల డోసును రోజుకు 400 మిల్లీగ్రాముల నుంచి కొన్ని వారాల్లో సున్నాకు ఎలా తగ్గించుకోవాలో చాట్‌జీపీటీ ఆమెకు ఒక ప్రణాళికను సూచించిందని తల్లిదండ్రులు తమ ఫిర్యాదులో ఆరోపించారు. అంతేకాదు, ఈ విషయాన్ని వైద్యులకు చెప్పవద్దని కూడా ఆ చాట్‌బాట్ సలహా ఇచ్చిందని వారు పేర్కొన్నారు. చాట్‌జీపీటీ సలహా మేరకు మందులు తగ్గించుకున్న బోవెన్ వాన్, 2026 ఫిబ్రవరిలో మూర్ఛ వ్యాధికి సంబంధించిన సమస్యలతో (సడెన్ అన్‌ఎక్స్‌పెక్టెడ్ డెత్ ఇన్ ఎపిలెప్సీ-హాఖణజ్హూ) మరణించారు. ఆమె మరణానంతరం నిర్వహించిన పరీక్షల్లో, ఆమె శరీరంలో లామోట్రిజిన్ మందు స్థాయిలు వైద్యపరంగా అవసరమైన దానికంటే చాలా తక్కువగా ఉన్నట్లు తేలింది. ఆమెకు చికిత్స అందించిన న్యూరాలజిస్ట్ కూడా, ఆమె పరిస్థితికి మందులు ఆపేయమని తాను ఎట్టిపరిస్థితుల్లోనూ సలహా ఇచ్చేవాడిని కాదని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలపై ఓపెన్‌ఏఐ స్పందిస్తూ, ఈ ఘటన హృదయ విదారకమని పేర్కొంది. బోవెన్ వాన్ ఉపయోగించిన చాట్‌జీపీటీ మోడల్ పాత వెర్షన్ అని, ప్రస్తుతం అందుబాటులో లేదని తెలిపింది. అత్యవసర పరిస్థితులను గుర్తించడంలో కొత్త సిస్టమ్స్ మెరుగ్గా పనిచేస్తాయని వివరణ ఇచ్చింది. ఈ కేసు ఇంకా కోర్టులో విచారణ దశలోనే ఉన్నప్పటికీ, కీలకమైన ఆరోగ్య విషయాల్లో ఏఐ సలహాలను గుడ్డిగా నమ్మడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

అంతరిక్షంలో చైనా రహస్య విమానం.. డ్రాగన్ ప్లాన్ ఏంటి..?

- చైనా షెన్‌లాంగ్ స్పేస్ ప్లేన్ ఫొటోను విడుదల చేసిన అమెరికా
- కక్ష్యలో మరో వ్యోమనౌకతో కలిసి ఉన్నట్లు ఫొటోలో స్పష్టం
- 2024 మే నెలలో యూఎస్ శాటిలైట్ ఈ చిత్రాన్ని తీసింది
- చైనా స్పేస్ ప్లేన్ కార్యకలాపాలపై తీవ్రమైన ఉత్కంఠ
- అమెరికా ఎక్స్-37బీ తరహాలోనే చైనా కూడా రహస్య ప్రయోగాలు చేస్తోంది



అంతరిక్షంలో చైనా రహస్యంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలకు సంబంధించి అమెరికా సంచలన చిత్రాన్ని విడుదల చేసింది. చైనాకు చెందిన స్పేస్ ప్లేన్ 'షెన్‌లాంగ్' (రాష్ట్రవఅశ్రీశీఅస్త్ర), కక్ష్యలో మరో గుర్తుతెలియని వ్యోమనౌకతో కలిసి ఉన్న అరుదైన ఫొటోను అమెరికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఐ×ూ) బయటపెట్టింది. ఈ పరిణామం అంతరిక్షంలో చైనా సామర్థ్యం, దాని లక్ష్యాలపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠను రేకెత్తించింది. డీఐఏ తన 'ఛాలెంజెస్ టు సెక్యూరిటీ ఇన్ స్పేస్' నివేదికలో ఈ చిత్రాన్ని ప్రచురించింది. 2024 మే నెలలో షెన్‌లాంగ్ తన మూడో మిషన్‌లో ఉన్నప్పుడు, అమెరికాకు చెందిన వాంటోర్/మ్యాక్సార్ కంపెనీకి చెందిన 'వరల్డ్‌వ్యూ-3' శాటిలైట్ సుమారు 90 కిలోమీటర్ల దూరం నుంచి ఈ హై-రిజల్యూషన్ ఫొటోను తీసింది. ఈ ఫొటోలో షెన్‌లాంగ్ రెక్కలు, తెరిచి ఉన్న పేలోడ్ బే, అలాగే దాని వెనుక భాగంలో సోలార్ ప్యానెళ్లతో కూడిన మరో వ్యోమనౌక స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే, ఆ రెండో వ్యోమనౌక ఏంటి, వాటి మధ్య సంబంధం ఏంటనేది రహస్యంగానే ఉంది. అమెరికాకు చెందిన ఎక్స్-37బీ స్పేస్ ప్లేన్ తరహాలోనే చైనా కూడా ఈ షెన్‌లాంగ్‌ను అభివృద్ధి చేసింది. దీనిని రాకెట్ ద్వారా ప్రయోగించి, కక్ష్యలో కార్యకలాపాలు నిర్వహించి, తిరిగి భూమిపై రన్‌వేపై ల్యాండ్ అయ్యేలా డిజైన్ చేశారు. ఇప్పటివరకు షెన్‌లాంగ్ నాలుగుసార్లు ప్రయోగాలు జరిపింది. 2026 ఫిబ్రవరిలో నాలుగోసారి ప్రయోగించినప్పుడు, "శాంతియుత పునర్వినియోగ వ్యోమనౌకల సాంకేతిక అభివృద్ధి కోసం" ఈ ప్రయోగం చేపట్టినట్లు చైనా ప్రకటించింది. అయితే, ఈ స్పేస్ ప్లేన్ ద్వారా ఎలాంటి ప్రయోగాలు చేస్తోందో, ఏ పేలోడ్‌లను తీసుకువెళుతోందో చైనా అత్యంత రహస్యంగా ఉంచుతోంది. గతంలో పలుమార్లు షెన్‌లాంగ్ నుంచి కొన్ని వస్తువులు కక్ష్యలోకి విడుదలైనట్లు లియోల్యాబ్స్ వంటి అంతరిక్ష పరిశోధన సంస్థలు గుర్తించాయి. ఈ తాజా ఫొటోతో, కక్ష్యలో ఇతర వ్యోమనౌకలతో అనుసంధానమయ్యే సాంకేతికతను చైనా సాధించిందని స్పష్టమైంది. అమెరికా కూడా తన ఎక్స్-37బీ స్పేస్ ప్లేన్ కార్యకలాపాలను అత్యంత రహస్యంగా ఉంచుతున్న నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య అంతరిక్షంలో ఆధిపత్య పోటీ మరింత తీవ్రమవుతోందని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

ఏపీ ఇంటర్ విద్యార్థులకు ఊరట.. ఫీజు చెల్లింపు గడువును పొడిగించిన బోర్డు

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంటర్ బోర్డు ఊరట కల్పించింది. 2027 మార్చిలో జరగనున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పొడిగించింది. వాస్తవానికి, ఫీజు చెల్లించేందుకు ఇవాళ్టితో (అక్టోబరు 29) గడువు ముగియనుండగా, విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని బోర్డు కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గడువులోగా ఫీజు చెల్లించలేని విద్యార్థులకు మరో అవకాశం కూడా కల్పించారు. రూ.1,000 ఆలస్య రుసుముతో నవంబర్ 17వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. అయితే, ఇదే చివరి అవకాశమని, ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ గడువు పొడిగింపు ఉండబోదని బోర్డు అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి, నిర్దేశిత గడువులోగా ఫీజు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ పొడిగించిన గడువు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ చదువుతున్న రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులతో పాటు, గతంలో ఫెయిల్ అయిన వారు, ప్రైవేటుగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కూడా వర్తిస్తుందని బోర్డు పేర్కొంది. విద్యార్థులు తమ కళాశాలల ద్వారానే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష ఫీజు గడువు పొడిగింపు సమాచారాన్ని విద్యార్థులందరికీ తెలియజేయాలని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలను ఇంటర్ బోర్డు ఆదేశించింది.

'బౌన్స్ బ్యాక్ అవ్వాలా? ఎందుకు?'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ తన శరీరాకృతిపై వస్తున్న విమర్శలకు స్పందించారు. ప్రసవం తర్వాత మహిళల శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయని, అలాంటి సమయంలోనూ పాత రూపంతో పోలుస్తూ విమర్శించడం సరైంది కాదనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన జీవితంలోని అందమైన దశను ఆస్వాదించడంపైనే దృష్టి పెట్టాలనుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రసవం తర్వాత మహిళలు వెంటనే మునుపటి శరీరాకృతికి తిరిగి రావాలనే ఒత్తిడిపై ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కత్రినా కైఫ్, ఆమె భర్త విక్కీ కౌశల్ ఇటీవల అంబానీ కుటుంబం నిర్వహించిన గణేశ్ చతుర్థి వేడుకలకు హాజరయ్యారు. తల్లి అయిన తర్వాత చాలా కాలానికి ఆమె బహిరంగంగా కనిపించడంతో ఆ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. అయితే కొందరు నెటిజన్లు ఆమె ప్రస్తుత రూపాన్ని గతంలో ఉన్న రూపంతో పోలుస్తూ వ్యాఖ్యలు చేశారు. ప్రసవం తర్వాత బరువు పెరిగారంటూ విమర్శలు చేయడంతో ఈ వ్యవహారం చర్చకు దారితీసింది. కత్రినాకు మద్దతుగా పలువురు ప్రముఖులు, అభిమానులు నిలిచారు. ప్రసవం తర్వాత శరీరంలో వచ్చే మార్పులు సహజమని, వాటిని విమర్శలకు కారణంగా మార్చకూడదని అభిప్రాయపడ్డారు. తాజాగా కత్రినా సైతం ఈ విమర్శలపై స్పందిస్తూ తన ఆలోచనలను పంచుకున్నారు. ప్రసవం తర్వాత మహిళల శరీరంలో వచ్చే మార్పుల గురించి చాలామందికి అవగాహన ఉంటుందని కత్రినా పేర్కొన్నారు. అయినప్పటికీ కొందరు అలాంటి మార్పులను విమర్శించాలని నిర్ణయించుకుంటే అది వారి వ్యక్తిగత నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఇతరుల అభిప్రాయాల కోసం తన జీవితంలోని ముఖ్యమైన దశను పక్కన పెట్టబోననే విషయాన్ని ఆమె స్పష్టం చేశారు. ప్రసవం తర్వాత మహిళలు వీలైనంత త్వరగా గతంలో ఉన్న శరీరాకృతికి తిరిగి రావాలనే భావనపై కూడా కత్రినా స్పందించారు. 'బౌన్స్ బ్యాక్' అనే పదాన్ని ప్రస్తావిస్తూ, తన జీవితంలోని ఈ అందమైన దశను ఆస్వాదిస్తూ ముందుకు సాగాలనుకుంటున్నట్లు తెలిపారు. తన మనసులో ఎప్పటినుంచో ఉన్న ఒక బలమైన కోరికను నెరవేర్చుకుంటూ జీవితంలో కొత్త దశలోకి అడుగుపెట్టానని, అలాంటప్పుడు మళ్లీ వెనక్కి వెళ్లాలని ఎందుకు అనుకోవాలని ప్రశ్నించారు.

జైలర్ 2 ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయిందా ..

సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో వచ్చిన భారీ యాక్షన్ చిత్రం 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. అక్టోబర్ 15న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.755 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ప్రచారం జరుగుతోంది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా డిజిటల్ విడుదల తేదీపై ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'జైలర్ 2' డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా నవంబర్ 12 నుంచి స్ట్రీమింగ్‌కు రానుందనే ప్రచారం ప్రస్తుతం సాగుతోంది. తమిళంతో పాటు తెలుగు, ఇతర భాషల్లోనూ అందుబాటులోకి రానుందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, నవంబర్ 12నే విడుదలవుతుందనే విషయంపై చిత్ర బృందం లేదా ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాబట్టి స్ట్రీమింగ్ తేదీపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన కోసం వేచి చూడాలి. 2023లో విడుదలైన 'జైలర్' చిత్రానికి కొనసాగింపుగా 'జైలర్ 2' తెరకెక్కింది. మొదటి భాగానికి వచ్చిన ఆదరణతో రెండో భాగంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రజనీకాంత్ మరోసారి టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించడం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రజనీకాంత్‌తో పాటు మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, విద్యా బాలన్, ఎస్.జే. సూర్య, జాకీ ష్రాఫ్, రమ్యకృష్ణ, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించగా, సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మించారు. భారీ తారాగణం, యాక్షన్ సన్నివేశాలు, రజనీకాంత్ స్టైల్ ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. థియేటర్లలో సినిమా చూసినవారు ఇప్పుడు ఓటీటీ విడుదల కోసం ఎదురుచూస్తున్నారు.

ఆ పాత్ర కోసం ప్రాణం పణంగా పెట్టా

నటి రెజీనా కసాండ్రా తన సినీ కెరీర్‌లో తొలిసారిగా ఒక పూర్తిస్థాయి కమర్షియల్ విలన్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రంలో తాను పోషించిన 'భైరవి' అనే పవర్‌ఫుల్ నెగెటివ్ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించానని ఆమె అన్నారు. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న రెజీనా పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుందర్ సి పై రెజీనా ప్రశంసలు కురిపించారు. "గత 30 ఏళ్లుగా తమిళ చిత్ర పరిశ్రమలో ఉంటూ, ఇతర పరిశ్రమలకు వెళ్లకుండానే తమిళ సినిమాను పాన్-ఇండియా స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి సుందర్ సి. అలాంటి దర్శకుడి సినిమాలో ఇంత బలమైన విలన్ పాత్ర లభించడం సంతోషంగా ఉంది. ఇందులో నయనతారతో నా ఫైట్ సీన్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి" అని ధీమా వ్యక్తం చేశారు. 2020లో ఘన విజయం సాధించిన 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా రాబోతోంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ డివోషనల్ కామెడీ చిత్రాన్ని ఇషారి కె. గణేశ్ నిర్మించారు. ఇందులో నయనతార, ఖుష్బూ, స్నేహ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా పూజ నుంచి ప్రీ-రిలీజ్ ఈవెంట్ వరకు ప్రతీది ఎంతో గ్రాండ్‌గా నిర్వహించిన నిర్మాత ఇషారి కె. గణేశ్ కు రెజీనా ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి భారీ బడ్జెట్ మహిళా ప్రాధాన్య చిత్రాలు నిర్మించడం తనలాంటి ఎందరో నటీమణులకు కొత్త ఆశను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని, కథను నమ్మి ముందుకొచ్చే నిర్మాతలకు అందరూ మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.

ఆర్‌సీ17 లో విజయ్ సేతుపతి?

రామ్‌చరణ్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత వీరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమా నవంబర్ 1న పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభంకానుందని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ సినిమా కాస్టింగ్‌కు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త బయటికొచ్చింది. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రకోసం ప్రముఖ తమిళ నటుడు విజయ సేతుపతి తీసుకోవాలని దర్శకుడు సుకుమార్ భావిస్తున్నట్లు తెలిసింది. విలక్షణ నటుడిగా పేరున్న విజయ్ సేతుపతి ఈ సినిమాలో భాగమైతే తమిళనాట కూడా ప్రాజెక్ట్‌పై హైప్ పెరిగే అవకాశముందని అంటున్నారు. అయితే ఈ విషయంలో మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా తెరకెక్కించబోతున్నాయి.

ఆదర్శ కుటుంబం'.. జస్ట్ ఇదొక్కటి వస్తే చాలు!

టాలీవుడ్ నుంచి రిలీజ్ కి రాబోతున్న లేటెస్ట్ అవైటెడ్ సినిమానే ఆదర్శ కుటుంబం. వెంకీ మామ హీరోగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలయికలో చేసిన ఈ ఫ్యామిలి డ్రామా పలుమార్లు వాయిదా తర్వాత కొంచెం రాష్ట్రంలో పరిస్థితులు అటు ఇటుగా ఉన్నప్పటికీ మేకర్స్ విడుదలకి తీసుకొస్తున్నారు. అయితే ఈ సినిమాకి ట్రైలర్ తర్వాత ఆడియెన్స్ లో మరిన్ని అంచనాలు ఏర్పడ్డాయి. కానీ త్రివిక్రమ్, వెంకీ మామ కాంబినేషన్ అంటే ఉండాల్సిన హైప్ ఇది కాదు. సో దీన్ని రీచ్ అయ్యి బాక్సాఫీస్ దగ్గర హిట్ కొట్టాలంటే సినిమా విడుదల అయ్యాక టాక్ మాత్రం పాజిటివ్ గా పడాల్సిందే అని చెప్పాలి. సినిమాలు చూడండి ఇదొక్కటి పడితే చాలా రోజులు నుంచి సరైన ఫ్యామిలీ ఎంటర్టైనర్ లేక ఆకలి మీద ఉన్న కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమాకి క్యూ కడతారు. ఇక మీద అంతా కంటెంట్ మీదనే ఆధారపడి ఉందని చెప్పాలి. ఇక ఈ సినిమాకి థమన్ సంగీతం అందించాడు. చినబాబు నిర్మాణం వహించారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com